క్లుప్తంగా

నకిలీ విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: నకిలీ విత్తనాలు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వమే రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేసి వ్యాపారుల చేతుల్లో మోసపోకుండా చూడాలన్నారు. సమావేశంలో పీవైఎల్ నాయకులు చిన్నిప్రసాద్, ఐఎఫ్టీయూ నాయకులు హనీఫ్, పీడీఎస్‌యూ నాయకులు రవి, డేవిడ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

మద్దికెర: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు దరిచేరవని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. శుక్రవారం స్థానిక సాయినగర్ కాలనీలో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ తదితర వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే వైద్యశాలలో మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడి దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

మెలకువలు పాటించాలి

మద్దికెర: పంటల సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి రవి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి సభ్యులు రైతులకు పంటల సాగుపై, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర: మండలంలోని చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ రవీంద్రనాథ్ శుక్రవారం తెలిపారు. 5 ఎకరాలలోపు పొలం ఉండి వ్యవసాయ బావులు ఉన్న రైతులు పండ్ల తోటలు పెంచుకునేందుకు ముందుకు వస్తే ఉపాధి హామీ పథకం కింద మూడేళ్లపాటు మొక్కల నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం యూనియన్ నాయకులు పట్టణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాయకులు అడివన్న, ఎల్లప్ప,వెంకటేశ్వర్లు మండల నాయకులు తిమ్మన్న,సురేష్, శేఖర్, రామచంద్ర, వెంకట్రాముడు, నీలకంఠ ఆచారి, శ్రీనివాసులు, మల్లప్ప, కోటప్ప, రాముడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యాకానుక కిట్లు

కృష్ణగిరి: పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కింద అందించనున్న కిట్లను అన్ని పాఠశాలలకు చేర్చుతున్నట్లు ఎంఈఓవిజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన కృష్ణగిరిలో జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. మండలంలోని 46పాఠశాలల్లో దాదాపుగా 7,400 మంది విద్యార్థులకు ఈయేడాది పాఠశాల ప్రారంభం రోజునే విద్యా కానుక కిట్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరు: పట్టణంలోని కోర్టు రోడ్డులో నివాసం ఉంటున్న తాహెరా అనే వివాహిత దోమల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం సుజాత, శర్మ దంపతులతో ఇంటిశుభ్రత విషయంలో జరిగిన గొడవలో సుజాత తలకు గాయాలయ్యాయి. ఆమె కింద పడటం వల్లే గాయాలయ్యాయని, ఆ కేసులో తనను దోషిని చేశారంటూ తాహెరా శుక్రవారం ఇంటిలో ఉన్న దోమల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు హుటాహుటినా ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం చేపట్టాలి

ఎమ్మిగనూరు టౌన్: ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం సత్వరం చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో దాదాపు 40 వేల ఎకరాల కు సాగునీరు, 1.20 లక్షల మందికి తాగునీరు అందించే రాజోలిబండ డైవర్షన్ స్కీం(ఆర్డీఎస్) నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టులతో పాటు ఆర్డీఎస్ కాలువా నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో జిల్లా స్థాయి సీపీఐ శిక్షణా తరగతులకు హాజరు కావాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు పంపణ్ణగౌడ్, భాస్కర్‌యాదవ్, సమీవుల్లా పాల్గొన్నారు.

ఏళ్ల కల నెరవేరిన వేళ

- రూ.3.71కోట్లతో పైచింతలకొండ బీటీ రోడ్లు
- పీసీ కొండ గ్రామస్తుల కల సాకారం చేసిన ప్రభుత్వం
- త్వరలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పైచింతలకొండ మారుమూల గ్రామం. దీనికి మట్టి రోడ్డే గతి. అధ్వానమైన రోడ్డులో రాకపోకలు సాగించాలంటే ప్రజలకు నరకప్రాయమే. గ్రామానికి 108 అంబులెన్స్ గానీ, ఆటోలు గానీ వెళ్లేవి కావు. ఏళ్ల తరబడి గుంతల దారిలోనే ఆ గ్రామ ప్రజలు నడక సాగించేవారు. గత టీడీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో రోడ్డంటూ కాలం వెళ్లదీసింది. ఇన్నాళ్లకు వారి కష్టాలు గట్టెక్కాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో రెండేళ్ల క్రితమే ప్రభుత్వం బీటీ రోడ్డుకు రూ.3.71 కోట్లు మంజూరు చేసింది. అయితే కరోనా కారణంగా ఆలస్యమైంది. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపడంతో బీటీ రోడ్డు నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండు రోజుల్లో రోడ్డు పనులు పూర్తి కానున్నాయి. – తుగ్గలి



పైచింతలకొండ రోడ్డు దుస్థితి



కళకళలాడుతున్న పైచింతలకొండ రోడ్డు

తుగ్గలి మండలం శభాష్‌పురం పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన పైచింతలకొండ గ్రామం. ఈ గ్రామంలో 150 కుటుంబాలు, 790 మంది జనాభా ఉన్నారు. ఏ చిన్న అవసరం వచ్చినా మూడు కిలోమీటర్లకు పైగా ఉన్న శభాష్‌పురానికి కాలినడకన వచ్చి అక్కడి నుంచి ఆటోల్లో పట్టణాలకు వెళ్లేవారు. కనీసం ఆటోలు కూడా వెళ్లేవి కావు. ఎక్కడికెళ్లాలన్నా వారికి నరకప్రాయంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వం బీటీ రోడ్డు వేస్తామని చెప్పి మభ్యపెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక శభాష్‌పురం నుంచి పైచింతలకొండకు 3.9కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టింది.రెండేళ్ల క్రితమే రోడ్డునిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీదేవి భూమి పూజ చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పనులు చేపట్టలేదు.ఎమ్మెల్యే మళ్లీ ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు పనులు పూర్తి చేయిస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల్లో రోడ్డు పనులు పూర్తి కానున్నాయి. సర్పంచ్ పుష్పావతి, ఎంపీటీసీ సభ్యురాలు రామాంజనమ్మ, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

కష్టాలు తీర్చారు



ఏళ్ల తరబడి రోడ్డు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఊర్లోకి ఆటోలు కూడా వచ్చేవి కావు. ఎక్కడికెళ్లాలన్నా నడిచి వెళ్లాల్సిందే. అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు కూడా చేరుకోలేక ఇబ్బంది పడ్డాం. ఇన్నాళ్లకు తారు రోడ్డు వేయడంతో మా కష్టాలు తీరాయి. చాలా సంతోషంగా ఉంది. – రంగమ్మ, పైచింతలకొండ

దారి చూపించారు



ఎన్నో ఏళ్లగా అధ్వానమైన మట్టి రోడ్డుతో నరకం చూశాం. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే చాలా అవస్థలు పడేవాళ్లం. ఆస్పత్రులకు వెళ్లాంటే అవస్థలు తప్పేవి కావు. ఎట్టకేలకు తారు రోడ్డు వేయడంతో మా కాష్టాలు తీరి గమ్యానికి సమయానికి చేరుకోగలుగుతున్నాం. – వెంకటాచలం, పైచింతలకొండ

ఏళ్ల కల నెరవేరింది



ఎన్నో ఏళ్ల నుంచి పీసీ కొండకు తారు రోడ్డు వేయమని కోరినా ఇన్నాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వం రోడ్డు వేస్తామని చెప్పి మభ్యపెట్టింది. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గెలిచిన వెంటనే తారురోడ్డు నిర్మాణా నికి చర్యలు తీసుకుంది. కాస్తా ఆలస్యమైనా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో ఎట్టకేలకు రోడ్డు పనులు పూర్తవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం. – హనుమంతు, సచివాలయ మండల కన్వీనర్, శభాష్‌పురం

ఫిర్యాదులొస్తే వేటు తప్పదు

ఆలూరు: రేషన్‌కార్డు దారుల నుంచి ఫిర్యాదులు వస్తే వేటు తప్పదని తహసీల్దార్ విజయ్‌కుమార్ రేషన్ డీలర్లను హెచ్చరించారు. ఫిర్యాదులు ఎదుర్కొంటున్న డీలర్లను శుక్రవారం ఆయన తన కార్యాలయానికి పిలిపించి విచారించారు. లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. మరోసారి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

తుగ్గలి: ఆసుపత్రుల్లో కాన్పులు కావడం ఎంతో సురక్షితమని డాక్టర్ మహ్మద్ పాషా అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పగిడిరాయి పీహెచ్‌లో శుక్రవా రం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుడా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు తల్లీ బిడ్డకు సురక్షితమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం


గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం స్కానింగ్ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి వెంట వచ్చిన సహాయకులకు పోచిమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో భోజన సదుపాయాన్ని కల్పించారు. గైనకాలజిస్టు కల్పన చేతుల మీదుగా భోజనం వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవరగట్టు లక్ష్మి, నెనావత్ సరోజ, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకోండి



ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కోటేశ్వరరావును ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయనను కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం ఇచ్చారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఆలూరు రూరల్: ఖరీస్ సీజన్ సాగులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆలూర ఏడీఏ సునీత అన్నారు. ఏరువాక పౌర్ణమ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్నూలు ప్రధాన రహదారి సమీపంలోని ఛత్రప్ప పొలంలో కంది విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్యకమరమైన విత్తనాలను ఎంచుకుని శుద్ధిచేయాలన్నారు. దీని వల్ల తెగుళ్లకు అరికట్టవచ్చని చెప్పారు. శిలీంద్రా నాన్ని, కీటక నాశిని, జీవరసాయనం మందులతో అరగంట విరామంతో మూడు వేర్వేలు దఫాలో శుద్ధి చేసుకోవాలని చెప్పారు. అదును చూసుకుని రైతులు విత్తనం విత్తుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోని ఆర్బీకేలలో విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులో ఉంచామన్నారు. పంటల సాగులో సలహాలు సూచనల కోసం ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ గౌడ్ వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.


ఆలూరు సమీప పొలంల్లో విత్తనం నాటుతున్న వ్యవసాయ అధికారులు

పౌష్టికాహారం తీసుకోవాలి

దేవనకొండ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే అందుకు పౌష్టిక ఆహారం తీసుకోవాలని పీహెచ్ కేంద్రం వైద్యుడు విజయ్‌భాస్కర్ సూచించారు. స్థానిక పీహెచ్ కేంద్రంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు సూచన, సలహాలను పాలించాలన్నారు.

నునుసరాళ్లలో ఆధ్యాత్మిక సందడి


హోమంలో పాల్గొన్న దృశ్యం

తుగ్గలి: కోటి రూపాయలకుపైగా ఖర్చు చేసి నూతనంగా నిర్మించిన సోమ లింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా నునుసరాళ్లలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేదమంత్రోచ్చారణల మధ్య శుక్రవారం స్వామి, దేవతామూర్తుల గ్రామోత్సవం, గణపతి, రుద్ర, చండీ హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ ఉత్సవాలకు సాయంత్రం జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, దాతలు పురుషోత్తంరెడ్డి, మధుకేశవరెడ్డి, సర్పంచ్ రామలక్ష్మమ్మ, గ్రామ పెద్దలు స్వామికి ఘన స్వాగతం పలికారు.

ప్రజా క్షేమమే తమ లక్ష్యం

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


చెర్లకొత్తూరు మహిళల సమస్యను వింటున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: ప్రజా క్షేమమే తమ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల సమస్యలను విన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై, షాదీఖానా ప్రారంభానికి, రామళ్లకోట బ్రిడ్జ్ వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈ గురుప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డితో చర్చించారు. చెర్లకొత్తూరులో ఇళ్ల మధ్య ఉన్న మరుగుదొడ్డితో ఇబ్బందులు పడుతున్నామన్న సమస్యపై ఆ గ్రామ మహిళల విన్నపం మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఈఓఆర్డీ నరసింహులును ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈనెల 13న పత్తికొండలో భారీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత, జీతాల పెంపుపై హర్షం

ఉద్యోగ భద్రత, జీతాల పెంపుపై జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్లు, వంట మనుషులు, నాన్ టీచింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కేక్ కట్ చేయించారు. పూలమాల వేసి, శాలువాలో ఘనంగా సత్కరించారు. సీఎంకు రుణపడి ఉంటాయని సిబ్బంది తెలిపారు.

ఓపీఎస్ అమలు చేయాలి

గోనెగండ్ల: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక(బస్టాండ్) పాఠశాల ఆవరణంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామన్, చంద్రపాల్ మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ రెండు కూడా షేర్ మార్కెట్లకు, కార్పొరేట్లకు లాభం చేకూరేవే తప్ప ఉద్యోగికి ఏమాత్రం లాభం చేకూరేలా లేవన్నారు. కాబట్టి ఉద్యోగ ఉపాధ్యాయ భద్రతను దృష్టిలో ఉంచుకొని జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తామనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ నాయకులు వెంకటరమణ, రాముడు, జిక్రియ, లక్ష్మణ రావు, ఉసేన్, శివరాముడు, అక్బార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

మద్దికెర: రైల్వే ట్రాక్‌కు పొలాలు ఇచ్చిన రైతులకు తగిన పరిహారం అందేలా న్యాయం చేస్తామని ఆర్డీఓ మోహన్‌దాస్ అన్నారు. డోన్ నుంచి గుంతకల్లు రైల్వే డబుల్ ట్రాక్ కోసం భూములు కోల్పోయిన పెరవలి, హంప గ్రామాల రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైల్వే అధికారులతో చర్చించి, నిబంధనల ప్రకారం పరిహారం మంజూరు అయ్యే లా చూస్తామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఈయనతో పాటు తహసీల్దార్ నాగరాజు ఉన్నారు.

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి ఈ నెల 11న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.హాల్‌టిక్కెట్లను http://a pmr.ap.gov. in వైబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు.

విత్తనం కొరత రానివ్వం

ఆస్పరి: రైతులకు విత్తనం కొరత రానివ్వబోమని తహసీల్దార్ కుమార్‌స్వామి తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహామండలి చైర్మెన్ గోపాల్‌రెడ్డి, ఏఓ నరేంద్ర కుమార్ సమక్షంలో విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో రైతులకు సబ్సిడీ విత్తనం కొరత లేకుండా చూస్తామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎమ్మిగనూరు: పట్టణంలోని వెంకటాపురం కాలనీ శివారులో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న 20 మందిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి తెలిపారు.అరెస్టుచేసిన వారినుంచి రూ.3.04 లక్షలు స్వాధీనం చేసుకొని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

సేవలు విస్తృతం చేయండి

నందవరం: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామ సచివాలయం-2ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులు గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూసార పరీక్ష ఆధారంగా పంటలు సాగు చేయాలి

కృష్ణగిరి: రైతులు తమ పొలాలను భూసార పరీక్ష చేయించుకుని వాటి అనుగుణంగా సాగుచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఆర్బీకేల్లో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు తమ పొలాన్ని భూసార పరీక్ష చేయించుకుని వాటికి అనుగుణంగా పంటలకు చీడ పీడలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచి రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే భూమి సారవంతమై దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. రైతులు పండించిన పంటను గ్రేండింగ్ చేసుకుంటే మరలా విత్తుకోసం ఉపయోగించుకోవచ్చన్నారు.

విత్తనాల పంపిణీ

ఎమ్మిగనూరు: మండల పరిధిలోని కడిమెట్ల పంచాయితీలో సచివాలయం-3 సిబ్బంది శుక్రవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. సచివాలయం పరిధిలోని రైతులకు వేరుశనగ విత్తనాలను ఆ గ్రామ సర్పంచ్ మారెప్ప ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

భూ సర్వేతో సమస్యల పరిష్కారం

గోనెగండ్ల: భూ రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ రాఘు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామంలో సర్పంచ్ మహేశ్వరి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

సచివాలయ పనులను వేగవంతం చేయండి

- పీఆర్ డీఈ శ్రీరాములు

ఆలూరు: సచివాలయ భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని పీఆర్ పీడీ శ్రీరాములు కాంట్రాక్టర్లకు సూచించారు. హాలహర్వి మండలం కామినహాళ్, హాలహర్విలో కొనసాగుతున్న సచివాలయాలు, రైతు భరోకా కేంద్రాలు, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌లను శుక్రవారం ఆయన తనిఖీచేశారు. అనంతరం స్థానిక కార్యాలయంలో విలేకులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఆరు మండలాలు, గ్రామాలకు 96 సచివాలయాలు మంజూరు కాగా అందులో 36 పూర్తయ్యాయని, 49 వివిధ దశల్లో పనులు కొనసాగుతన్నాయని తెలిపారు. 96 ఆర్బీకేలు మంజూరుకాగా 21 పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో పనులు జరుగుతన్నాయన్నారు. ఆలూరు మండలంలో కాత్రికి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. హాలహర్వి మండలం నిట్రవట్టి, గూళ్యం, కొక్కెరచేడు గ్రామాలకు రూ.35 లక్షలు, ఆస్పరి మండలం బనువనూరు గ్రామానికి రూ.20 లక్షలు ఖర్చు చేసి సీసీ రోడ్డు పనులను పూర్తి చేశామన్నారు. దేవనకొండ, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో ఇప్పటి వరకు మంజూరైన నిధులతో సీసీ రోడ్లు త్వరలో ప్రారంభించేందుకు జేఈలకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

నందవరం: పండ్ల తోటల పెంపకంపై రైతులను ప్రోత్సహించాలని ఏపీడీ అల్లిపీర ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరి ఉపాధి పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ సూర్జహాన్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయాలి

ఎమ్మిగనూరు: అనుమతుల్లేని పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నా పట్టించుకోని ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలను సస్పెండ్ చేయాలని ఆర్వీపీఎస్ నాయకులు షాహిద్ ఆఫ్రిది డిమాండ్ శుక్రవారంప్రకటనలో కోరారు.

విద్యా కానుక పంపిణీ

గోనెగండ్ల: స్థానిక ఎమ్మార్సీకి చేరిన జగనన్న విద్యా కానుక కిట్లను శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకుపంపిణీచేసినట్లు ఎంఈఓ వినోద్‌కుమార్ తెలిపారు.

పథకాలు అందేలా చూడాలి

హొళగుంద: రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అగ్రికల్చరల్ అడ్వైజర్ బోర్డు చైర్మన్ మల్లికార్జున కోరారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో జరిగిన అగ్రికల్చరల్ బోర్డు మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగుకు సబ్సిడీ ఎరువులు, విత్తనాలతో పాటు ఇతర సబ్సిడీ పరికరాలు రైతులకు అందేలా చూడాలని ఏఓ ఆనంద్ లోకదళ్‌కు సూచించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

నందవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. శుక్రవారం నదికై రవాడి, ఇబ్రహీంపురం, మాచాపురం గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణలపై అవగాహన కల్పించారు. హౌసింగ్ ఏఈ గురుస్వామి, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

హాలహర్వి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని అర్ధగేరి గ్రామానికి చెందిన సుంకన్న కుమారుడు వీరేష్(26) సొంతపని నిమిత్తం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం గోనేహాళ్ గ్రామానికి ద్విచక్ర వాహంపై వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి అర్ధగేరి గ్రామానికి బయలుదేరాడు. కాసేపటికే మార్గమధ్యలో గోనేహాళ్ వద్ద తలకు తీవ్రగాయాలై విగతజీవిగా రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. కాగా పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

దైవ దర్శనానికెళ్లి..

- కర్ణాటకలో రైలు ఢీకొని మహిళ మృతి


నాగలక్ష్మి (ఫైల్)

హొళగుంద: దైవ దర్శనం కోసం కర్ణాటకలోని ఉలిగి పుణ్య క్షేత్రానికి వెళ్లిన హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన బోయ కొత్తింటి నాగలక్ష్మి (23) రైలు ఢీకొని మృతిచెందారు. వివాహితురాలైన ఈమె గురువారం బంధువులతో కలిసి ఉలిగికి వెళ్లారు. రాత్రి ఆలయం వద్దే నిద్రించిన ఆమె శుక్రవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు పక్కనున్న రైలు పట్టాలు దాటి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆ పట్టాలపై చీర కొంగు చిక్కుకుంది. తీసుకునేలోపు రైలు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు నాగలక్ష్మికి భర్త బొజ్జయ్య, కుమారుడు, కూతురు ఉన్నారు.